Local News



# ఆచారాలను కాపాడుకోవాలి

## పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**ములుగు, మన చౌరాస్తా :** మన ఆచారాలు, సంప్రదాయాలను కాపాడుకోవాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు మండలంలోని రామచంద్ర పూర్, ముద్దునూరు తండా గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. రామచంద్ర పూర్‌లో ఎన్ఆర్‌జీఎస్ నిధుల నుంచి 3 కీలో మీటర్లతో చేపట్టిన గ్రావెల్ రోడ్డు పనులను అదే విధంగా ఆంజనేయస్వామి గుడి కాంపౌండ్ వాల్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ముద్దునూరు తండాలో నూతనంగా నిర్మించిన మేరామ్మ యాడి గుడి లో ప్రత్యేక పూజలు చేశారు. గుడి చుట్టూ ప్రహరీకి నిధులతో పాటు గ్రామ ప్రజల కోరిక మేరకు తాగునీటి ఇబ్బందులు పడుతున్నా ప్రజల కోసం ఒక బోరు వేసేందుకు నిధులు కేటాయించారు. అనంతరం తండా ప్రజలతో కలిసి నృత్యం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డాక్టర్లు అందుబాటులో ఉండాలి

## – అడిషనల్ కలెక్టర్ పింకేశ్ కుమార్





**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** డాక్టర్లు పేద ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం బచ్చన్నపేట మండలంలో పర్యటించి మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను సంబంధిత వైద్య అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందుబాటులో లేని డాక్టర్లు మానస, సృజన, ప్రసన్న కృష్ణలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని బచ్చన్నపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ హాస్పిటల్స్ పర్యవేక్షకులు శ్రీనివాస్ ను ఆదేశించారు. అనంతరం మండలంలోని నారాయణపూర్ ను సందర్శించి డెంగ్యూ వ్యాధితో బాధపడుతున్న రోగిని పరామర్శించారు. అధైర్యపడరాదని తప్పనిసరిగా వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఫీవర్ సర్వేపై వివరాలు అడిగి తెలుసుకుంటూ వైద్యం కొరకు ప్రైవేట్ హాస్పటల్స్ కు వెళ్లిన వారి పాజిటివ్ రోగుల వివరాలను తెప్పించుకుని పిహెచ్‌సీకి గాని, సబ్ సెంటర్ల కానీ అందజేయాలన్నారు. హాస్పిటల్ పరిసరాలు పరిశీలిస్తూ పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుస్తూ అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారులతో కలిసి సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. పాఠశాల గదిలో ఫ్యాన్లను పరిశీలిస్తూ రెండు ఫ్యాన్లు ఉండడంతో అదనంగా మరో రెండు ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మండల నోడల్ అధికారులు వసతి గృహాలను నిరంతరం పరిశీలించాలని అప్రమత్తంగా ఉండాలని విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిశీలిస్తూ అవసరమైన వారికి వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పర్యవేక్షకులు శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి రాము, డీజీసీవో గౌసియా బేగం, మండల నోడల్ అధికారి వెంకటరెడ్డి, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలి

**చేర్యాల, మన చౌరాస్తా :** కల్లుగీత కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు కోరారు. గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్లమ్మ దేవాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎల్లమ్మ దేవాలయం వద్ద మండల, పట్టణ కమిటిల ఆధ్వర్యంలో రాష్ట్ర కల్లు గీత కార్మిక సంఘం చేపట్టిన అమరులైన గీత కార్మికుల యాదిలో భాగంగా సమావేశం అంబటి గోపాల్, అంబాల బుచ్చి రాములు ఆధ్వర్యంలో నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. కల్లు గీత కార్మిక సంఘంలో పనిచేసి అమరులైన వారి బాటలో నడవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అయిదు వేల కల్లు గీత కార్మిక కుటుంబాలు ఉన్నాయని వారి సమస్యల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని పోరాటాలు చేయాలని అన్నారు. కేవలం ఓటు బ్యాంకు గా మాత్రమే వాడుకుంటున్నారని వృత్తిలో ఆధునీకరణ చేపట్టడం లేదని, నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం వల్ల వృత్తికి దూరం అవుతున్నారని అన్నారు. సిద్ది పేట జిల్లా ప్రధాన కార్యదర్శి బండకింది అరుణ్ కుమార్ మాట్లాడుతూ బైక్ లు ఇవ్వాలని, సేఫ్టీ మోకులు ఇస్తూ వారి సంక్షేమానికి 5వేల కోట్ల నిధిని కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం అమరులైన వారికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అనగోని నరసింహులు, పోతుగంటి లింగం, రణం వెంకటేశం, అంబాల రాములు, మల్లేశం, పచ్చిమడ్ల వెంకటయ్య, బుడిగ శ్రీనివాస్, రావుల ఉమేష్,పోతుగంటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# సామాజిక సేవల ఫలితంగానే ఎమ్మెల్సీ పదవి

**జనగామ, మన చౌరాస్తా :** సియాసత్ న్యూస్ ఎడిటర్ ఆమిర్ అలీఖాన్‌కు ఎమ్మెల్సీ పదవి దక్కడంతో జనగామలో సంబరాలు జరుపుకున్నారు. నిరంతరం సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనే ఆమిర్ అలీఖాన్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడమంటే సేవానిరతికి గుర్తింపు ఇచ్చినట్లేనని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. మైనార్టీ సమాజంలో ఉన్న లోటుపాట్లపై ఆయనకు లోతైన అవగాహన ఉందని పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం నమాజు అనంతరం ఏక్‌మీనార్ మసీదుతో పాటు పట్టణంలో పలుచోట్ల సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా న్యాయవాది, టీపీసీసీ మైనార్టీ ఉపాధ్యక్షుడు జమాల్ షరీఫ్ మాట్లాడుతూ మైనార్టీలతో పాటు అట్టడుగు వర్గాల సమగ్ర అభివృద్ధి కోసం తపన పడే వ్యక్తికి సముచి స్థానం ఇవ్వడం వల్ల సమాజానికి ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమిర్ అలీఖాన్‌కు ఎమ్మెల్సీగా నియమించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పార్టీ అదిష్టానానికి న్యాయవాది రఫీ మతీన్,అబ్దుల్లా, అఫ్జల్, ఖాలిద్ సయీద్, నాజిం అలీ, అబ్దుల్ మన్నాన్ రజీ, రహీం తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

# బైపాస్ రోడ్డుకు మరమ్మతు చేయాలి

**చేర్యాల, మన చౌరాస్తా :** మండలంలోని ఆకునూర్ గ్రామ బైపాస్ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతూ శుక్రవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఎంపిఓ మహబూబ్ అలికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ మాట్లాడుతూ ఆకునూర్ బైపాస్ రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారిందనివెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరగా ఆయన గ్రామ కార్యదర్శికి ఫోన్ చేసి రోడ్డు పై మట్టి పోసి మరమ్మత్తు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈరి భూమయ్య పాల్గొన్నారు.